



వికారాబాద్ శివారాంనగర్ కాలనీ, వైభవలక్ష్మి ఆలయం, తాండూరు మండలం కొత్లాపూర్‌లో శుక్రవారం అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు.

అమ్మ దర్శనం.. ఆనందపరవశం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శుక్రవారం మహిషాసురమర్దినిగా ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పూజలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు అన్నప్రసాదం పంపిణీ చేశారు. – న్యూస్‌టుడే, వికారాబాద్ మున్సిపాలిటీ, తాండూరు గ్రామీణ.

ఈనాడు వికారాబాద్

శనివారం అక్టోబరు 12, 2024

జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజ



పూజ చేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయుధ, వాహన పూజలు నిర్వహించారు. ఎస్పీ నారాయణరెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చెడుపై మంచి విజయం సాధించినందుకు విజయ దశమి జరుపుకుంటున్నామన్నారు. సమాజ రక్షణలో పోలీసులకు ఆయుధాలు అండగా ఉంటాయన్నారు. అందుకే వాటిని పవిత్రమైనవిగా భావించి పూజించే సాంప్రదాయం భారతీయ ధర్మంలోనే ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పరస్పరం గౌరవించుకోవాలన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందని సౌభాగ్యం

ప్రతిపాదనల్లోనే జనరిక్ మందుల దుకాణాలు

న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. వ్యక్తిగత రుణాలతోపాటు సమష్టిగా అందిస్తూ సంఘాల బలోపేతానికి తోడ్పడుతోంది. మరోవైపు గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే చౌక ధరలకు మందులు అందించే దుకాణాలు ఏర్పాటు చేయించేందుకు సంకల్పించింది. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు కనీసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రారంభిస్తామని అధికారులు రెండేళ్లుగా చెబుతున్నా ప్రతిపాదనలతోనే సరిపోయింది. ఇప్పటి వరకు ఒక్కటీ ప్రారంభించకపోవడంతో పేదల ఆశలు ఆవిరవుతున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఎంతో మేలు..: సౌభాగ్య పథకం కింద జన్ ఔషధి స్టోర్ పేరిట రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించి మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఔషధ దుకాణాలు నిర్వహించాల్సి ఉంది. వ్యవసాయాధారిత జిల్లా కావడంతోపాటు నిరక్షరాస్యత అధికంగా ఉండటంతో మహిళల్లో ఆరోగ్యంపై అవగాహన కొరవడి తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. మందుల కొనుగోళ్లు వారికి ఆర్థిక భారంగా మారాయి. చౌక ధరలకు ఔషధాలు దొరకితే ఎంతో ప్రయోజనం కలగనుంది. పల్లెల్లో కొనసాగుతున్న ఆర్ఎంపీ, పీఎంపీలు సైతం నాడి పడితే రూ.వందల్లో గుంజుతున్నారు. సెలైన్ పెడితే రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. ఒక్కసారి అనారోగ్యం పాలైతే వారం, పది రోజులు చేసిన కూలీ డబ్బులు ఆవిరయిపోతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు.



మండలాలు:	20
పొదుపు సంఘాలు:	15,966
గ్రామ సమాఖ్యలు:	655
సంఘాల సభ్యులు:	1,69,250

నిబంధనల సడలింపు..

జనరిక్ ఔషధ స్టోర్‌లను ప్రారంభించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. గతంలో బీ ఫార్మసీ, ఎంఫార్మసీ చదువుకున్న వారికే అవకాశముండేది. ప్రస్తుతం ఆ నిబంధనను సవరించారు. సంఘం సభ్యురాలి కుటుంబీకులు, స్నేహితులు, బంధువులు దరఖాస్తు చేసుకోవచ్చు. ధ్రువపత్రాన్ని అయిదేళ్లపాటు లీజుకు తీసుకొని నడిపించేందుకు అవకాశం కల్పించారు. గతేడాది తాండూరు, కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్, దోమ నుంచి ప్రతిపాదనలు వెళ్లినా వివిధ కారణాలతో అవి తిరస్కరణకు గురయ్యాయి.

వచ్చే నెలాఖరులోపు ప్రారంభిస్తాం..



జిల్లాలోని అన్ని మండలాల్లో జనరిక్ ఔషధ దుకాణాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. తొలి దశలో జిల్లాలో కనీసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ విషయంలో సంఘాల్లోని సభ్యులకు ప్రత్యేకించి అవగాహన కల్పిస్తున్నాం. సభ్యుల పిల్లలు అర్హులైతే ప్రతి మండల కేంద్రంలోనూ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. అందుబాటు ధరల్లో పేదలకు మందులు అందించడం జనరిక్‌తోనే సాధ్యం.

– ఉదయకుమారి, స్త్రీనిధి జిల్లా మేనేజర్.

పోస్టుల భర్తీ.. పెరిగిన ఆదరణ



జిల్లా విద్యాశిక్షణ సంస్థ వసతి గృహం

న్యూస్‌టుడే, వికారాబాద్ కలెక్టరేట్, పరిగి: గురువుల పోస్టుల భర్తీ కొనసాగుతుండడంతో ఉపాధ్యాయ శిక్షణపై యువతకు ఆసక్తి పెరుగుతోంది. గతేడాది వికారాబాద్ ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో సుమారు 40 సీట్ల వరకు భర్తీ కాలేదు. ఈసారి మాత్రం అన్నీ నిండాయి. శిక్షణ సంస్థలో 150 సీట్లున్నాయి. సమస్యలతో కొట్టుమిట్టాడిన సంస్థను గాడిన పెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

29 మంది ఉపన్యాసకులు..

జిల్లా విద్యాశిక్షణ సంస్థలో 29 మంది ఉపన్యాసకులు ఉండాలి. ఒక్కొక్కరు పదవీ విరమణ చేయడంతో చాలా పోస్టులు ఖాళీ అయ్యాయి. ఇటీవల 13 మంది అతిథి అధ్యాపకులను నియమించి కొరత తీర్చారు. కొత్త వారికి ఈనెల 17- 20 వరకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు. దీంతో సమస్య పరిష్కారం కానుందని చెబుతున్నారు.

37 ఏళ్ల కిందట ప్రారంభం..

వికారాబాద్‌లో జిల్లా విద్యాశిక్షణ సంస్థ 37 ఏళ్ల కిందట ప్రారంభించారు. ఏటా 150 మంది విద్యార్థులను కొత్తగా చేర్చుకొని శిక్షణ ఇస్తారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో కలిపి 300 మంది ఉంటారు. తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాల్లో 50 చొప్పున సీట్లు ఉన్నాయి.

అధ్యాపకుల కొరత తీరనుంది..

జిల్లా విద్యాశిక్షణ సంస్థలో ఖాళీలను అతిథి అధ్యాపకులతో భర్తీ చేశాం. దీంతో అధ్యాపకుల కొరత తీరనుంది. కొత్తగా ఎంపికైన వారికి రెండ్రోజులపాటు శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తయ్యాక ఈనెల చివరి వారం నుంచి వారు బోధన ప్రారంభిస్తారు. ఉపాధ్యాయ శిక్షణకు అభ్యర్థుల్లో ఆసక్తి పెరిగింది. ఈసారి ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఎంపిక, ధ్రువపత్రాల పరిశీలన పూర్తయింది. త్వరలో తరగతులు ప్రారంభం కానున్నాయి.

– రామాచారి, ప్రిన్సిపల్, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, వికారాబాద్.

హైందవ చైతన్యంతోనే భారత సంక్షేమం



మాట్లాడుతున్న అడికిచర్ల రంగయ్య, అనంతరెడ్డి

యాలాల, న్యూస్‌టుడే: రాబోయే రోజుల్లో హైందవ చైతన్యంతోనే భారత సంక్షేమం కొనసాగుతుందని రాష్ట్రీయ స్వయం సేవక్ ప్రముఖ్‌లు అడికిచర్ల రంగయ్య, ప్రధాన వక్త కెరెల్లి అనంతరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం యాలాల ఖండ ఆధ్వర్యంలో పదచలనం, విజయ దశమి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా పంచ పరివర్తన కార్యక్రమాన్ని సమాజంలోకి తీసుకెళ్లాలని సంఘం సభ్యులకు సూచించారు. జిల్లా సంపర్క్ ప్రముఖ్ గాజుల సిద్ధిరామేశ్వర్, ఖండ కార్యవాహ రావుల శివరాజు, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, కాంగ్రెస్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచి రవీందర్, నాయకులు ఆకుల బస్వరాజ్, తపస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి భూమిపూజ

కొడంగల్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా గురుకుల పాఠశాలల భవనాలు నిర్మించి, నాణ్యమైన విద్య అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ గుర్నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పుర పరిధిలోని పాత కొడంగల్‌లో గురుకుల పాఠశాలల భవనాల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 28 గురుకులాలకు రూ.6వేల కోట్లు కేటాయించి విద్యకు మొదటి ప్రాధన్యం ఇస్తున్నారన్నారు. విద్యావ్యవస్థ బలంగా ఉండాలనే ఉద్దేశంతో ఒకేసారి 11వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామన్నారు. గురుకుల పాఠశాలలు 20 ఎకరాల్లో నిర్మించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిరుపతిరెడ్డి అన్నారు. ఏడాదిలో పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. క్రీడా కోర్టులు నిర్మిస్తారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్‌కుమార్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, సహాయ కలెక్టర్ ఉమాహారతి, ఎస్పీ నారాయణరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వసంత్ నాయక్, డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, అధికారులు శ్రీధర్‌రెడ్డి, ఉమేష్, మల్లేశం, సురేందర్, పుర ఛైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, పుర కమిషనర్ బలరాంనాయక్, నాయకులు ముద్దప్ప, నందారం ప్రశాంత్, రాజేష్‌రెడ్డి, వార్ల విజయ్‌కుమార్, అంబయ్యగౌడు పాల్గొన్నారు.



భవన నమూనా పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి తదితరులు

గరుడ వాహనంపై అనంత పద్మనాభుడు



స్వామివారి గరుడ వాహనాన్ని మోస్తున్న శుభప్రద్ పటేల్, సుధాకర్‌రెడ్డి తదితరులు

వికారాబాద్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం వికారాబాద్ పరిధి ఆలంపల్లిలో దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పెరుగు బసంతం సందర్భంగా శ్రీ అనంతపద్మనాభ స్వామివారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి స్వామివారి సేవలో పాల్గొని పల్లకి మోశారు. స్వామివారిని చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సాయంత్రం స్వామివారి హంసవాహన సేవ నిర్వహించారు.

తాగిన మైకంలో.. కాలువలో పడి మృతి

పరిగి గ్రామీణ: మద్యం మత్తులో వ్యక్తి మురుగు కాలువలో పడి మృతిచెందిన సంఘటన సయ్యద్‌మల్కాపూర్‌లో శుక్రవారం జరిగింది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు.. ప్యాట చంద్రయ్య(42)కూలీ. భార్య, కూతురు ఉన్నారు. మద్యానికి బానిసగా మారడంతో భార్య కొన్నేళ్ల కిందట కూతురుతో కలిసి వెళ్లిపోయింది. దీంతో గ్రామంలోనే తల్లి బాలమణితో కలిసి ఉంటున్నారు. ఈనెల 9న తల్లికి చెప్పి బయటికి వెళ్లాడు. ఆచూకీ లభించలేదు. ఇంటి పరిసరాల్లో మురుగు కాలువలో శుక్రవారం కాళ్లు కనిపించాయి. గ్రామస్థులను పిలిచి బయటికి తీసి చూడగా అప్పటికే మృతిచెందాడు. తల్లి ఫిర్యాదు ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మానసిక ప్రశాంతతతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్: సమస్యలను అతిగా ఊహించుకొని ఒత్తిడికి గురి కావడంతోనే రోగాల బారిన పడుతున్నారని, మానసిక ప్రశాంతతతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా.సున్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ న్యాయస్థానం ఆవరణలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సమస్యలు అందరికీ ఉంటాయని, ప్రశాంతంగా ఆలోచిస్తే పరిష్కారం లభిస్తుందన్నారు. మానసిక నిపుణురాలు సాయిప్రశాంతి మాట్లాడుతూ.. ఉరుకులు, పరుగుల జీవితంలో ఎదురయ్యే సమస్యలు, అధిగమించే మార్గాలను వివరించారు. మానసిక సమస్యలకు టోల్ ఫ్రీ నంబరు 14416కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తి చంద్రకిషోర్, సీనియర్ సివిల్ జడ్జి డి.బి.శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రుతిదూత, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం: స్పీకర్



మాట్లాడుతున్న గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్వామివారి ఆలయంలో బ్రహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి పనులు సులభంగా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. సభ్యుల వినతి మేరకు వికారాబాద్‌లో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి రెండెకరాల స్థలం మంజూరుకు కృషి చేస్తానన్నారు. స్పీకర్ ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి శేషవస్త్రాన్ని ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అందించారు. కార్యక్రమంలో పురపాలక సంఘం మాజీ అధ్యక్షుడు వి.సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ డా.జి.అనంతలక్ష్మి, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పగడాల లక్ష్మీనారాయణ, నాయకులు రాములుయాదవ్, రవీందర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, రాము, చెక్క వీరన్న, చండీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారాపై కొరడా



నీలిగడ్డ తండాలో గిరిజనులతో సమావేశమైన ఆబ్కారీ పోలీసులు

న్యూస్‌టుడే, తాండూరు

పండగల నేపథ్యంలో జిల్లాలో సారా విక్రయాల కట్టడికి ఆబ్కారీ శాఖ పకడ్బందీగా వ్యవహరిస్తోంది. ఈ మేరకు విక్రయాలు, ఉత్పత్తి అయ్యే తండాలను తరచూ సందర్శిస్తున్నారు. సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం అమ్మే వారిపై నిఘా పెంచారు. దసరా, సంక్రాంతి పండగలప్పుడు గ్రామాల్లో సారా ఏరులై పారుతుంది.

సరిహద్దుల్లో తనిఖీలు..

కర్ణాటక రాష్ట్రం నుంచి జిల్లాలోకి సారా రాకుండా ఆబ్కారీ శాఖ సరిహద్దుల్లో నిఘా ఏర్పాటు చేసింది. బషీరాబాద్ మండలం ఎక్మయి, నీళ్లపల్లి, తాండూరు మండలం కొత్లాపూరు, ఓగిపూరు, పెద్దేముల్ మండలం తట్టేపల్లి, అడ్కిచర్ల, ఓంలానాయక్‌తండా, బంట్వారం మండలం తొర్మామిడి, బోపునారం సరిహద్దులున్నాయి. వాటికి సమీపంలోనే కర్ణాటక గ్రామాలున్నాయి. ఇక్కణ్నుంచి జిల్లాలోకి సారాతోపాటు ఇతర రాష్ట్రాల మద్యం రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. తండాల్లో తయారయ్యే సారా.. మద్యం కంటే చాలా చౌకగా లభిస్తుంది. దీంతో వ్యవసాయ కూలీలు, కార్మికులు, గ్రామీణులు సారాపై ఆసక్తి చూపుతారు. సారా శాస్త్రీయ పద్ధతిలో తయారు కాదు. ఒక్కోసారి కల్తీ అయ్యే ప్రమాదముంది. తాగితే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. ఆబ్కారీ శాఖ అధికారులు సారా తయారు చేసే తండాలను సందర్శించి హెచ్చరిస్తున్నారు.

28 ప్రభావిత తండాలు..

జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్, మోమిన్‌పేట ఆబ్కారీ సర్కిల్ కార్యాలయాల పరిధిలో 28 తండాల్లో సారా తయారీ, విక్రయాలు సాగుతుంటాయని ఆబ్కారీ శాఖ గుర్తించింది. దీంతో అధికారులు తరచూ ఆ తండాలను సందర్శిస్తున్నారు. అనుమానిత వ్యక్తులను గుర్తించి పద్ధతి మారకుంటే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

కేసులు పెడుతున్నాం..

జిల్లాలో సారా తయారీ, విక్రయాలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. అనుమానిత తండాలను తరచూ సందర్శించి సారా తయారీకి వినియోగించే బెల్లం ఊటను పారబోస్తున్నాం. బట్టీలను ధ్వంసం చేస్తున్నాం. సారా తయారీ, అమ్మేవారితో పాటు నల్ల బెల్లం విక్రయించే వారిపై కేసులు నమోదు చేశాం. – **విజయ భాస్కర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్.**

ఆరు గ్యారంటీల అమలుకు ధర్నాలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు భారాస ఆధ్వర్యంలో దీపావళి తరవాత ప్రజలతో కలిసి ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో గుణపాఠం చెబుతారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా అమలు చేయకుండా రైతులను నిండా ముంచారని ఆరోపించారు. బతుకమ్మ పండగకు మహిళలకు చీరలు పంపిణీ చేయలేదని ఆరోపించారు. శాసన మండలి విప్‌గా బాధ్యతలు చేపట్టిన మహేందర్‌రెడ్డి తాండూరుపై కపట ప్రేమ ఒలకబోస్తున్నారన్నారు. భారాసను మోసం చేసి అధికారం కోసం పార్టీలు మారుతున్నారన్నారు. తాండూరులో కాంగ్రెస్ నాయకులు ఇసుక, మట్టి రవాణాతోపాటు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజుగౌడ్, నయీం, రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సిద్ధిధాత్రి దేవిగా వనదుర్గమ్మ



పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో దేవీనవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. శుక్రవారం మహర్నవమి సందర్భంగా మెరూన్ రంగు వస్త్రాలంకరణలో సిద్ధిధాత్రి దేవీ(సర్వ నారాయణి)గా అమ్మను అలంకరించారు. అర్చకులు తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. వరద తగ్గడంతో భక్తులను దర్శనాలకు గర్భాలయంలోకి అనుమతించారు.

అసుర సంహారం.. సరస్వతీదేవి రూపం



వర్గల్: సిద్దిపేట జిల్లా వర్గల్ విద్యా సరస్వతి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిషాసురమర్దినిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయంలో సుగంధద్రవ్యాలతో నింపిన 108 కలశాల పూజలు చేశారు. అమ్మవారిని భాజపా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ దంపతులు, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి దంపతులు దర్శించుకొని అర్చించారు.



కౌమారం.. దేవీ రూపం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో బాలకుమారీల పూజను శుక్రవారం నిర్వహించారు. చిన్నారులను దేవి రూపంగా అలంకరించారు. బాలికలు అమ్మవారితో సమానమని.. ధైర్యశాలిగా పెంచాలని నిర్వాహకురాలు బీకే భవాని అన్నారు. సంస్థ ప్రతినిధులు స్వప్న, స్రవంతి, సభ్యులు ఉన్నారు. - న్యూస్‌టుడే, సిద్దిపేట

సంకల్ప దీక్ష.. విజయ కాంక్ష

సిద్దిపేట ■ మెదక్ ■ సంగారెడ్డి ■ వికారాబాద్ ■



న్యూస్‌టుడే, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి అర్బన్, జహీరాబాద్, వికారాబాద్ కలెక్టరేట్

చెడుపై మంచి.. నిరాశపై ఉత్సాహం.. అనారోగ్యంపై ఆరోగ్యం.. వేధింపులపై చైతన్యం.. ఇలా సమాజ హితాన్ని కోరే ప్రతీది విజయం సాధించాల్సిన సందర్భమిది. విజయానికి ప్రతీకగా నిలిచే దసరా.. ఆశావహ దృక్పథంతో అడుగేయాల్సిన ఆవశ్యకతను చెబుతోంది. దుర్గాదేవి.. మహిషాసురుడి ని తొమ్మిది రాత్రులు యుద్ధం చేసి అంత మొందించిన సందర్భంగా విజయ దశమిని అత్యంత వైభవంగా నిర్వహించుకుంటున్న వేళ మార్పు తీసుకురావాల్సిన అంశాలపై ప్రత్యేక కథనం.

కొలువుపై యువగురి



యువత లక్షల్లో..
4.50
2.50
7.00
3.80

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో జనాభాలో సింహభాగం యువతదే. లక్ష్య సాధనే ధ్యేయంగా దీక్షతో శ్రమిస్తున్నారు. తాజా డీఎస్సీలో విడుదలైన ఫలితాలే ఇందుకు నిదర్శనం. భవానీమాత స్ఫూర్తితో ఎంతోమంది విజయాలు అందుకున్నారు.

అంధుడైనా గెలిచి..

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన బూర్డిపాడ్ ప్రవీణ్‌కు పుట్టుకతో అంధుడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో డీఎడ్ పూర్తిచేశారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను విని, ఇంట్లో కుటుంబీకుల ద్వారా చదివించుకున్నారు. ఇతరుల సాయంతో డీఎస్సీ రాసి ఫలితం అందుకున్నారు. నిరాశలో కూరుకుపోతున్న వారికి ఇతడే ఆదర్శం.





ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో శమీవృక్షానికి పూజలు సహా పాలపిట్ట దర్శనానికి పల్లెలు, పట్టణాల్లో ప్రజలు బారులు తీరుతారు. యువత ఆటాపాటలతో సందడి చేస్తారు. నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జగన్మాతను కొలిచే భక్తులు తన్మయత్వానికి లోనవుతుంటారు. నిమజ్జనం సమీపించడంతో మండపాల్లో విశేష పూజలు ప్రత్యేకతను చాటుతాయి.

ఆరోగ్య దీక్ష

మారుతున్న జీవనశైలి, ఆహార అలవాట్లు, జన్యుపరమైన సమస్యలు, కాలుష్యం, ఇతర కారణాలతో ఎంతోమంది బాధపడుతున్నారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో ప్రతి ఒక్కరూ జీవనశైలిని మార్చుకోవాలని చెబుతోంది భవానీమాత. పలువురు భక్తులు నవరాత్రులు అమ్మ దీక్ష తీసుకున్నారు. ఈ స్ఫూర్తితో ఆరోగ్య రక్షణకు దీక్షబూనాల్సి ఉంది. రోజులో కనీసం గంట వ్యాయామం, యోగా, ఆటలపై దృష్టి సారించాలి. మైదానం బాటపడితే మార్పునకు అడుగేసినట్లే.



శక్తి స్వరూపిణి..

ఆడపిల్లలు, మహిళలు శక్తి స్వరూపిణితో సమానం. అన్ని రంగాల్లో తమదైన సత్తా చాటుతున్నారు. గృహిణి, ఉద్యోగిని, వ్యాపార, వాణిజ్యం, రాజకీయం, సాంకేతికం.. ప్రతి అంశంలో అగ్రభాగాన నిలుస్తున్నారు. మరోవైపు మాత్రం ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. అపోహలు, వేధింపులు పెరుగుతున్నాయి. ఇందులో మార్పు రావాల్సిన ఆవశ్యకత ఉంది. శక్తిస్వరూపిణి కళ్లు తెరిచే వరకు చూడొద్దు మరి.

మహిళలు లక్షల్లో..
4.50
1.90
7.50
3.50

బ్లడ్ క్యాన్సర్‌ను జయించి..

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన సుజాతకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. కొంతకాలం కిందట బ్లడ్ క్యాన్సర్ బారిన పడ్డారు. భర్త సహకారంతో మనోధైర్యంతో ఎదుర్కొన్నారు. అమ్మవారి స్ఫూర్తితో కుమిలిపోలేదు. చివరకు చికిత్స పొంది క్యాన్సర్‌ను జయించారు. ప్రస్తుతం కుటుంబీకులతో సంతోషంగా ఉంటున్నారు.



ప్రకృతి ఆరాధన

అడవులు (హెక్టార్లలో..)
26,041
57,000
20,662
43,200


బతుకమ్మ, దసరా.. ప్రకృతితో మమేకం కావాలని చెబుతున్నాయి. అలాంటి ప్రకృతి సంరక్షణకు అందరూ ప్రతినబూనాలని దుర్గమ్మ సూచన. అడవుల శాతం తగ్గిపోతుండటంతో పర్యావరణ రక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఏటా ప్రతి ఒక్కరూ కనీసం పది మొక్కలు నాటితే వాతావరణం, వాయు, జల, కాలుష్యానికి అడ్డుకట్ట పడినట్లే. గ్రామాల్లోకి వస్తున్న జంతు జాతులు జనాలను వీడి తిరిగి వనాల బాట పడతాయి.



పిల్లలే స్ఫూర్తి..

మెదక్ జిల్లా చేగుంట మండలం కరీంనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఒకప్పుడు కళావిహీనంగా ఉండేది. ఉపాధ్యాయులు, విద్యార్థులు చొరవ చూపి బడి రూపురేఖలను మార్చుకున్నారు. ఆరేళ్ల కిందట మొక్కలు నాటి సంరక్షించడంతో ఇప్పుడు పచ్చదనం స్వాగతం పలుకుతోంది. వీరి స్ఫూర్తిగా అందరూ కదిలితే అమ్మ సంతోషించినట్లే.

శమీ వృక్షానికి పూజలు



ద్వాపర యుగంలో పాండవులు అజ్ఞాతవాస ఆరంభంలో తమ ఆయుధాలను ఒక జమ్మిచెట్టు (శమీవృక్షం) కొమ్మపై భద్రపర్చారని మహాభారతం చెబుతోంది. ధర్మరక్షణకు వినియోగించే దివ్యమైన ఆయుధాలను శమీవృక్షం రక్షిస్తుంది. అందుకే జమ్మి చెట్టుకు పూజలు చేస్తుంటారని ప్రతీతి.

మస్కట్‌లో బతుకమ్మ సందడి



కొడంగల్, న్యూస్‌టుడే: తెలుగువారు ఎక్కడ ఉన్న మన సంప్రదాయాలు మరిచిపోరు అనేందుకు బతుకమ్మ పండుగనే ఉదాహరణ. శుక్రవారం ఒమన్ దేశంలోని మస్కట్‌లో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వాతి, రాధ, శైలజ, సంధ, రాధికలతో పాటు ఆవుల సత్యకుమార్, గణేష్ గుండేటి, కుమార్, రవి, రమేష్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు గద్దర్ పేరు

న్యూస్‌టుడే, తూప్రాన్: తూప్రాన్ మండలం కిష్టాపూర్ సమీపంలో హల్దీ వద్ద పెద్ద చెరువులోకి పంపింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన ఎత్తిపోతలకు 'గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్ పంపు హౌస్'గా నామకరణం చేశారు. గతంలో 30 ఏళ్ల పాటు పెద్ద చెరువు నిండకపోవడంతో ప్రజా గాయకుడు గద్దర్ ప్రత్యేక చొరవ తీసుకొని రూ.3.61 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయించారు. ఇటీవల తూప్రాన్ మున్సిపాలిటీలో గద్దర్ పేరు పెట్టాలని తీర్మానం చేయడంతో శుక్రవారం ఆ పనులు నిర్వహించారు. ఎత్తిపోతలకు గద్దర్ నామకరణం చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

గవ్వలపల్లి వాసికి అత్యుత్తమ పదవి



సంతోష్‌రావు

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లికి చెందిన ఏకే.సంతోష్‌రావు ఆస్ట్రేలియా-భారత వాణిజ్య విభాగం సలహా మండలి సభ్యునిగా నియమితులయ్యారు. ఆస్ట్రేలియా-ఇండియా ట్రేడ్ అసోసియేషన్ ఛైర్మన్ ఆశిశ్ మిశ్రా నియామకపత్రం అందించినట్లు శుక్రవారం ఆయన 'న్యూస్‌టుడే'కు తెలిపారు. భారతదేశానికి చెందిన తనకు ప్రత్యేక గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. ఆస్ట్రేలియాలో స్థిరపడిన ఆయనను తల్లి తాజా మాజీ సర్పంచి మంగాదేవి, ఏకే.యాదవరావులు, గ్రామస్థులు అభినందించారు.

జహీరాబాద్ మీదుగా జాల్నా- తిరుపతి ప్రత్యేక రైలు

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్: దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని జహీరాబాద్ స్టేషన్ మీదుగా జాల్నా- తిరుపతి (07621 జెటీఆర్‌టీవై/07622 టీఆర్‌టీవై జె) ప్రత్యేక రైలు అందుబాటులోకి వచ్చినట్లు స్థానిక స్టేషన్ మేనేజర్ మాధవకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13, 20, 27 తేదీలతోపాటు నవంబరు 3వ తేదీల్లో జాల్నా నుంచి తిరుపతికి రైలు ఉంటుందన్నారు. జహీరాబాద్ పట్టణానికి ఆయా తేదీల్లో తెల్లవారుజామున 4:28/4:30 గంటలకు చేరుకుంటుందని అన్నారు. తిరుపతి నుంచి జాల్నాకు తిరుగు ప్రయాణం ఈనెల 14, 21, 28తో పాటు నవంబరు 4వ తేదీన జహీరాబాద్‌లో ఉదయం 8:30/8:31 నిమిషాలకు ఉంటుందని పేర్కొన్నారు.

పదం.. కదం.. జనజాగృతం

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో 'నమస్తే సదావత్సలే మాతృభూమే' అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) కార్యకర్తల నినాదాలు మారుమోగాయి. సిద్దిపేటలో ఆర్‌ఎస్‌ఎస్ కవాతు (పద సంచాలన్) నిర్వహించి విజయదశమి ఉత్సవ ప్రదర్శన చేపట్టింది. అనంతరం జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రాంత సేవా ప్రముఖ్ గాజుల శివశంకర్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరిలో జాతీయత, వ్యక్తిగత శీలం పెంపొందాలన్నారు. ప్రస్తుతం హిందుత్వాన్ని దెబ్బతీసేందుకు హిందూవ్యతిరేక శక్తులు కుట్రలు చేస్తున్నాయని, జాగ్రత్తగా ఉంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. - న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్



సిద్దిపేటలో పద సంచాలన్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

నకిలీ బంగారంతో బురిడీ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: నకిలీ బంగారంతో గుర్తుతెలియని ఇద్దరు.. దంపతులను బురిడీ కొట్టించి రూ.3 లక్షలతో ఉడాయించిన ఘటన సిద్దిపేటలో ఆలస్యంగా వెలుగుచూసింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. రేణాకానగర్‌కు చెందిన ఉడుత రమేష్, రేణుక దంపతులు అదే కాలనీలో లేడీస్ ఎంపోరియం నడుపుతున్నారు. ఈనెల 5న గుర్తు తెలియని ఆడ, మగ ఇద్దరు వ్యక్తులు వచ్చి అన్నాచెల్లెళ్లమని నమ్మబలికారు. రేణుకతో పరిచయం పెంచుకొని తమ వద్ద కొంత బంగారం ఉందని చెప్పి చిన్న ముక్కఇచ్చారు. వారు వెళ్లాక పరీక్షిస్తే అసలైన బంగారమని తేలింది. మరుసటి రోజు దుండగులు వచ్చి ఆ ముక్కను తీసుకెళ్లారు. గురువారం సిద్దిపేటకు వచ్చి తాము వేములవాడ కమాన్ వద్ద ఉన్నామని 25 తులాల బంగారు బిస్కెట్ ఉందని. రూ.3 లక్షలకు ఇస్తామని చెప్పడంతో రేణుక దంపతులు నమ్మారు. రమేశ్ అక్కడికి వెళ్లి సొమ్ము ఇచ్చి దుండగులు ఇచ్చిన బిస్కెట్ తెచ్చారు. దాన్ని పరిశీలించగా నకిలీదని తేలింది. శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఓట్ల రాజకీయాలకే లౌకికవాదం: లక్ష్మణ్



రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ దంపతులకు ప్రసాదం, చీర అందిస్తున్న అర్చకులు

వర్గల్, న్యూస్‌టుడే: దేశంలో ఓట్ల రాజకీయాల కోసం లౌకికవాదం పేరిట కొందరు సనాతన ధర్మాన్ని విమర్శించడం పరిపాటిగా మారిందని భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ అన్నారు. సిద్దిపేట జిల్లా వర్గల్ విద్యాధరి క్షేత్రాన్ని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో దేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నత శిఖరాలకు చేర్చారన్నారు. గతానికి భిన్నంగా ప్రపంచాన్ని శాసించే స్థాయికి చేరువలో ఉన్నట్లు స్పష్టం చేశారు. హిందూ సమాజం జాగృతమై లౌకికవాదుల చర్యలను అడ్డుకోవడానికి మరింత చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక, యాంత్రిక జీవనానికి లోనై ఒత్తిడికి తట్టుకోలేక ధర్మం వైపు యువత ఆకర్షితులు కావడం శుభ పరిణామమని పేర్కొన్నారు. జిల్లా భాజపా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడిపై కేసు

పటాన్‌చెరు అర్బన్: యువతిని వేధిస్తున్న యువకుడిపై పటాన్‌చెరు ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలానికి చెందిన యువతి ఏఎన్‌ఎంగా పని చేస్తోంది. ఆరు నెలల క్రితం ఆటో డ్రైవర్ నేనావత్‌రెడ్డితో పరిచయమైంది. ప్రేమిస్తున్నానని చెప్పి బయటకు తీసుకెళ్లి ఆమెతో కొన్ని ఫొటోలు దిగాడు. తర్వాత అతడి ప్రవర్తన నచ్చక రెండు నెలలుగా మాట్లాడటం లేదు. పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి తనతో మాట్లాడాలని లేకుంటే ఫొటోలు బయట పెడతానని బెదిరించాడు. ఈనెల 10న బీరంగూడ, పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రుల వద్ద యువతిపై దాడిచేయడంతో పాటు చరవాణి గుంజుకొని నేలకేసి కొట్టాడు. శుక్రవారం, ఆమె ఉంటున్న వసతి గృహం వద్దకు వచ్చి బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: ఆలయాలే లక్ష్యంగా వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను శుక్రవారం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఎస్సై నారాయణగౌడ్ తన సిబ్బందితో కలిసి మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో వాహన తనిఖీలు చేస్తున్నారు. కారులో అనుమానాస్పదంగా వెళుతున్న ముగ్గురిని గుర్తించి ఆపేందుకు యత్నించగా.. పరారయ్యారు. ఎస్సై సిబ్బందితో వెంబడించి పట్టుకొని తనిఖీ చేయగా డిక్కీలో ఇనుప రాడ్లు, ఆలయాల్లో చోరీ చేసిన ఆభరణాలను గుర్తించారు. విచారించగా.. నిందితులు మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన అస్లాంఖాన్, షేక్ ఇలియాస్, షేక్ సమీర్‌లుగా గుర్తించారు. గత నెలలో కామారెడ్డి జిల్లా గోపాల్‌పేట గ్రామంలోని రామాలయం, మెదక్ జిల్లా హవేలిఘన్‌పూర్ మండలం పోచమ్మరాల్ తండాలో ఇంట్లో బంగారం, వెండి వస్తువులు, చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లిలోని దుర్గామాత ఆలయంలో కిరీటం, శఠగోపం, ఇత్తడి వస్తువులు, చేగుంట మండలం చందాయిపేటలోని హనుమాన్ ఆలయంలో వెండి, ఇత్తడి వస్తువులు ఎత్తుకెళ్లారు. చేర్యాలలోని గిఫ్ట్ ఆర్టికల్ దుకాణంలో రూ.60వేల నగదు దొంగిలించినట్లు పోలీసుల విచారణలో తెలిపారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలను హైదరాబాద్‌కు తీసుకెళ్లి విక్రయించాలని చూశారు. మార్గమధ్యలో గుడి, తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడడానికి వెళుతుండగా పోలీసులకు దొరికిపోయారు. వీరి నుంచి 51గ్రాముల బంగారు, 1.8కిలోల వెండి ఆభరణాలు, నగదు రూ.13,700, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. దొంగల ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై నారాయణగౌడ్, కానిస్టేబుళ్లు రాజశేఖర్, భాస్కర్‌లను ఎస్పీ అభినందించి నగదు పురస్కారాన్ని అందించారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్‌లు పాల్గొన్నారు.

ఆస్తిలో వాటా కోసమే.. శిశువు అపహరణ

- సంగారెడ్డి డీఎస్పీ వెల్లడి
- నలుగురు మహిళల అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్, సీఐ భాస్కర్, సీసీఎస్ ఎస్‌ఐ శ్రీకాంత్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా ఆసుపత్రిలో శిశువును అపహరించిన కేసులో పోలీసులు నలుగురు మహిళలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలు.. సంగారెడ్డిలోని నాల్‌సాబ్‌గడ్డకు చెందిన రుక్సానాబేగం 16 ఏళ్ల క్రితం దస్తగిరిని వివాహమాడింది. వీరికి ఇద్దరు మగ పిల్లలున్నారు. కొన్ని రోజుల క్రితం దస్తగిరి మరణించారు. ఆమె ఇక్కడి నుంచి హైదరాబాద్‌లోని బోరబండకు వెళ్లారు. హైదరాబాద్‌లోని బార్కస్(పాత పట్టణం)కు చెందిన మహ్మద్ సమీర్‌ను వివాహమాడింది. పిల్లలు పుట్టే అవకాశం లేదని, తన భర్త ఆస్తిలో వాటా దక్కదేమోనని ఆందోళన చెందింది. పసి పిల్లలను ఎవరైనా విక్రయిస్తారా.. అని ఆరా తీసింది. ఆ ప్రయత్నం ఫలించలేదు.

చాకచక్యంగా ఎత్తుకెళ్లారు

ఈ నెల 9న రుక్సానాబేగం, తల్లి సయిదాబేగం, వరుసకి చెల్లెళ్లు ముస్కాన్‌బేగం, జువేరియా ఫాతిమాలు కలిసి సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. దవాఖానా వెనుక తలుపు నుంచి వచ్చి బురకాలు ధరించారు. కారిడార్‌లో శిశువును పడుకొబెట్టిన విషయాన్ని గమనించారు. ఆ పాపను సయిదాబేగం అపహరించగా... స్కూటీపై సంగారెడ్డి పట్టణంలోకి.. అక్కడి నుంచి ఆటోలో హైదరాబాద్‌లోని బోరబండకు వెళ్లారు. శిశువు అపహరణపై బాధిత కుటుంబీకులు, ఆసుపత్రి పర్యవేక్షకులు పట్టణ సీఐ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమై పది బృందాలను నియమించారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా తనిఖీలు చేశారు. నిందితులు బోరబండకు వెళ్లినట్లు గుర్తించారు. బోరబండలో సయిదాబేగం, ముస్కాన్, జువేరియా ఫాతిమాలను గురువారం అరెస్టు చేశారు. అపహరణకు గురైన శిశువును తల్లిచెంతకు చేర్చారు. శుక్రవారం రుక్సానాబేగంను పోలీసులు అరెస్టు చేశారు. నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, సదాశివపేట సీఐ మహేశ్‌గౌడ్, పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి, సీసీఎస్ ఎస్‌ఐ శ్రీకాంత్, ఎస్‌ఐలు విజయ్‌గౌడ్, వినయ్, హరిశంకర్‌గౌడ్, సీసీఎస్, ఐటీ విభాగం సిబ్బందిని ఎస్పీ రూపేష్ అభినందించారు.

ఆలయాల్లో చోరీలు చేస్తున్న ముఠా పట్టివేత?

పాపన్నపేట, న్యూస్‌టుడే: ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఆగస్టు 9న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి రెండు హుండీలను ఎత్తుకెళ్లి వాటిలో నుంచి కానుకలు, నగదు దొంగిలించిన విషయం తెలిసిందే. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ఆలయాల్లో చోరీలు జరిగాయి. అక్కడి పోలీసులు ఓ ముఠాను అదుపులోకి తీసుకుని విచారించారు. వారు అక్కడి ఆలయాలతో పాటు ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో హుండీల చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. మండలంలోని మిన్పూర్‌కు చెందిన ఓ యువకుడు వీరితో ములాఖత్ అయ్యాడు. అతనే వారిని ఇక్కడికి తీసుకొచ్చి చోరీ చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు సమాచారం. స్థానిక ఎస్సై శ్రీనివాస్ గౌడ్‌ను వివరణ కోరగా... నిందితులు దొరికిన విషయం వాస్తవమేనని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

నేడు చంద్రగిరిలో శ్రీనివాసుడికి అశ్వవాహన సేవ

తాండూరు గ్రామీణ: విజయదశమి ఉత్సవాలను పురస్కరించుకొని చంద్రగిరిలోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీవేంకటేశ్వర ఆలయంలో శనివారం సాయంత్రం 5.30గంటలకు శ్రీనివాసుడికి అశ్వవాహన సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు పురంధచార్ శుక్రవార్ వెల్లడించారు.

కురుమ సంఘానికి ఆర్థికసాయం

గౌతాపూర్(తాండూరు గ్రామీణ), న్యూస్‌టుడే: తాండూరులో నిర్మించనున్న కురుమ భవన్‌కు గౌతాపూర్‌కు చెందిన కురువచందు రూ.11వేల విరాళాన్ని అందజేశారు.

భారాస మండల అధ్యక్షుడి నియామకం

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: మండల బారాసా అధ్యక్షుడిగా ముబారక్ పూర్ గ్రామానికి చెందిన ఎ. దయాకర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మెతుకు ఆనంద్ మండల నాయకుల సమక్షంలో నియామకపత్రాన్ని అందజేశారు.

చెట్ల కొమ్మల తొలగింపు

మర్పల్లి: మండల కేంద్రంలో తరుచూ విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుంది. వినియోదారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తు సిబ్బంది శుక్రవారం తీగలకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు.

మట్టిదారులకు మహర్దశ

● తారు వేసేందుకు రూ.98.29 కోట్లు విడుదల

న్యూస్‌టుడే, బొంరాస్‌పేట

సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం పెద్దమొత్తంలో నిధులు మంజూరవుతున్నాయి. ముఖ్యంగా రహదారుల అభివృద్ధి కోసం కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ పరిధిలోని మట్టి రహదారులను తారు రోడ్లుగా మార్చడానికి, రెండు వరుసల రహదారులుగా విస్తరించడానికి ప్రభుత్వం ఉమ్మడి బొంరాస్‌పేట మండలానికి రూ.98.29 కోట్లను విడుదల చేసింది. టెండర్లు పూర్తయి పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన రోడ్లకు కూడా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రహదారుల నిర్మాణం పూర్తయితే గ్రామాలకు రవాణా సౌకర్యం మరింత మెరుగవుతుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్అండ్‌బీ రోడ్లకు రూ.50.60 కోట్లు

ఆర్అండ్‌బీ అధీనంలోని రహదారులను అభివృద్ధి చేయడానికి రూ.50.60 కోట్లు మంజూరయ్యాయి.

● తుంకిమెట్ల నుంచి దుద్యాల మండలం హకీంపేట వరకు 11కిలో మీటర్ల దూరం ఉన్న రహదారిని రెండు వరుసలుగా మార్చడానికి రూ.14 కోట్లు.

● జాతీయ రహదారి నుంచి లింగన్‌పల్లి మీదుగా దుద్యాల వరకు రెండు వరుసల రహదారి నిర్మాణానికి రూ.28 కోట్లు మంజూరయ్యాయి.

● తుంకిమెట్ల- బొంరాస్‌పేట మధ్యన వంతెన నిర్మాణానికి రూ.5 కోట్లు విడుదలయ్యాయి.

● మూముమామిళ్ల తండా నుంచి బీక్యానాయక్‌తండాకు, ఏర్పుమళ్ల నుంచి సీత్యానాయక్‌తండాకు, జడ్పీ రోడ్డు నుంచి మద్దిమడుగుతండా వరకు, సాలిండాపూర్ నుంచి భోజ్యానాయక్‌తండాకు తారు రోడ్లు నిర్మించడానికి గిరిజన ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్టీఎస్‌డీఎఫ్) రూ.8.60 కోట్లు మంజూరయ్యాయి.

పీఆర్ పరిధిలోని వాటికి రూ.38.46 కోట్లు

పంచాయతీరాజ్ శాఖ అధీనంలోని రహదారులను అభివృద్ధి చేయడానికి రూ.38.46 కోట్లు మంజూరయ్యాయి.

● యాలాల మండలం నాగసముందర్ నుంచి దేవనూరు, మహంతిపూర్ మీదుగా బొంరాస్‌పేట వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ.23.86 కోట్లు వచ్చాయి.

● దుద్యాల నుంచి అల్లికాన్‌పల్లి మీదుగా నాచారం వరకు నిర్మాణానికి రూ.7.28 కోట్లు విడుదలయ్యాయి.

● ఎక్కచెరువుతండాకు తారు రోడ్డు కోసం రూ.75 లక్షలు. ● జడ్పీ రహదారి నుంచి సంత్రకుంటతండా వరకు తారు రోడ్డుకు రూ.1.89 కోట్లు కేటాయించారు.



తుంకిమెట్ల నుంచి హకీంపేట వరకు కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులు

● జాతీయ రహదారి నుంచి బాపన్‌చెరువుతండా వరకు తారు రోడ్డు కోసం రూ.1.58 కోట్లు వచ్చాయి.

● నాగిరెడ్డిపల్లి నుంచి దేవనూరు వరకు తారు రోడ్డు కోసం రూ.3.10 కోట్లు మంజూరయ్యాయి.

గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూ.9.23 కోట్లు

గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రహదారుల నిర్మాణానికి రూ.9.23 కోట్లు మంజూరయ్యాయి. బురాన్‌పూర్ నుంచి చెరువుముందలితండాకు రూ.53 లక్షలు, ఈర్లపల్లి నుంచి వాయిల్లగడ్డతండాకు రూ.88 లక్షలు, వడిచెర్ల నుంచి ఊరెనికితండాకు రూ.1.63 కోట్లు, భోజన్నగడ్డతండా నుంచి మైసమ్మగడ్డతండాకు రూ.1.30 కోట్లు, లగచెర్ల నుంచి వాల్యానాయక్‌తండాకు రూ.65.20 లక్షలు, బాపల్లితండా నుంచి సీత్యానాయక్‌తండాకు రూ.1.30 కోట్లు, మదన్‌పల్లితండా నుంచి ఇబ్రహీంపూర్ తండాకు రూ.97.80 లక్షలు, మూడుమామిళ్లతండా నుంచి దీప్లానాయక్‌తండాకు రూ.84.76 లక్షలు, హంసాన్‌పల్లి రహదారి నుంచి చెట్టుపల్లితండా వరకు రూ.2.60 కోట్లు మంజూరయ్యాయి.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ: ? సాల్వీడ్ గ్రామంలో ఇళ్ల మధ్యన ఏర్పాటు చేసిన నియంత్రిక ప్రమాదకరంగా కనిపిస్తుంది. నియంత్రిక దిమ్మె శిథిలావస్థకు చేరుకోవడంతోనే ఈ సమస్య ఏర్పడింది. దిమ్మె కూలితే ప్రమాదం జరగడానికి అవకాశం ఉంటుంది. – రాములు, స్థానికుడు

✓ గ్రామాల్లో నెలకొన్న నియంత్రికల సమస్యలను పరిష్కరించేలా చూస్తున్నాం. సాల్వీడ్‌లో సమస్య మా దృష్టికి వచ్చింది. పరిష్కరించేలా చూస్తాం. – సాయికిరణ్, ఏఈ విద్యుత్తు శాఖ

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: ? తాండూరు పురపాలక సంఘం పరిధిలోని రాజీవ్‌కాలనీ ప్రాంతంలో చెత్త సమస్య ఉంది. పరిష్కరించాలి. – నవీన్, తాండూరు

✓ వీధులు రోజూ శుభ్రం చేసే విధంగా చూస్తాం. –విక్రమ సింహా రెడ్డి, పురపాలక సంఘం కమిషనరు తాండూరు.

న్యూస్‌టుడే, పరిగి: ? పట్టణంలోని వేంకటేశ్వర కాలనీలో మురుగు కాల్వలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. మురుగు సాఫీగా ముందుకు సాగక దోమలు, ఈగల బెడదతో అవస్థలు పడుతున్నాం. సత్వరం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. – వెంకటేష్, కాలనీవాసి

✓ ప్రతి పక్షం రోజులకు, నెలకోసారి దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తున్నాం. పలుచోట్ల కొత్తగా మురుగు కాల్వల నిర్మాణ పనులు చేపడతాం. నిధులు త్వరలోనే మంజూరుకానున్నాయి.
– అశోక్‌కుమార్, ఛైర్మన్, మున్సిపాలిటీ

న్యూస్‌టుడే, దౌల్తాబాద్: ? మండలకేంద్రం నుంచి ఈర్లపల్లి వెళ్లే తారు రోడ్డు కోలుబావి దగ్గర కోసుకుపోయి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.
– రవి, దౌల్తాబాద్

✓ మరమ్మతులకు సంబంధిత శాఖ అధికారులకు వివరించాం.
– గోపాల్, పంచాయతీ కార్యదర్శి, దౌల్తాబాద్

పేరుకే మండలం.. సేవలు కనం

న్యూస్‌టుడే, దుద్యాల:

దుద్యాలలో ప్రజలకు తప్పని అవస్థలు

పరిపాలన సౌలభ్యం పేరిట గత ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. కానీ మండల నూతన కార్యాలయాల ఏర్పాటు మాత్రం కార్యరూపం దాల్చలేదు. 2022 అక్టోబరు 3న దుద్యాల నూతన మండలాన్ని ఏర్పాటు చేసి ప్రస్తుత ఎమ్మెల్యే చేతుల మీదుగా తహసీల్దార్ కార్యాలయం, మండల విద్యాధికారి కార్యాలయాలను అట్టహాసంగా ప్రారంభించారు. మండలం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచినా.. ఇంతవరకు కొత్త భవనాలు మంజూరు, అధికారిక పోస్టులు సృష్టించలేదు. దీంతో అధికారులు, మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారిక పోస్టు మంజూరు కాకపోవడం, జీతభత్యాలు సమయానికి రాకపోవడం తదితర కారణాలతో ఇప్పటి వరకు నలుగురు తహసీల్దార్లు మారారు. ప్రస్తుత సేవలు కలెక్టర్ ఆదేశాల మేరకే విధులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్ తెలిపారు. మండల విద్యాధికారి కార్యాలయంలో పర్యవేక్షణతోపాటు సిబ్బందిని కూడా నియమించలేదు.



ఉర్దూ మీడియం పాఠశాలలో తహసీల్దార్ కార్యాలయం

మిగతా కార్యాలయాలెన్నడో..

మండలం ప్రారంభంలో కేవలం తహసీల్దార్, ఎంఈవో కార్యాలయాలను మాత్రమే తాత్కాలిక కార్యాలయాల్లో ప్రారంభించింది.. మిగతా కార్యాలయాలు ఏర్పాటు ఇంత వరకు నోచుకోలేదు. తహసీల్దార్ కార్యాలయాన్ని మొదట గ్రామ పంచాయతీ భవనంలో, ఎంఈవో కార్యాలయాన్ని ప్రాథమిక పాఠశాలలోని ఓ తరగతి గదిలో హడావుడిగా ప్రారంభించారు. తర్వాత తహసీల్దార్ కార్యాలయాన్ని గ్రామ పంచాయతీ భవనం నుండి ఉర్దూ మీడియం పాఠశాలలోకి మార్చారు. అక్కడ రికార్డులు భద్రపర్చేందుకు సరిపోక గదులు లేక ఇరుకు గదుల్లోనే నెట్టుకొస్తున్నారు. మిగతా కార్యాలయాలైన మండల పరిషత్తు కార్యాలయం, పోలీసు శాఖ కార్యాలయం, మహిళా సమాఖ్య, పశుసంవర్ధక శాఖ కార్యాలయం వంటి వాటిని ఎప్పుడు ఏర్పాటు చేస్తారోనని మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

హకీంపేటకు తరలింపు

ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన ఐటీఐ కళాశాల, ప్రభుత్వ దవాఖానా, ప్రభుత్వ జూనియర్ కళాశాలను హకీంపేట గ్రామంలో ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేశారు. కాగా వీటిని మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఏది ఏమైనా ఉన్నతాధికారులు నూతన మండలంపై దృష్టి సారించి కొత్త కార్యాలయాల మంజూరు, భవనాల నిర్మాణం, సిబ్బంది కొరత సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఓ తరగతి గదిలో ఎంఈవో కార్యాలయం

గ్రంథాలయ ఛైర్మన్‌కు సత్కారం



రాజేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు, తదితరులు

కొడంగల్, న్యూస్‌టుడే: కొత్తగా ఎన్నికైన గ్రంథాలయ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డిని శుక్రవారం లయన్స్‌క్లబ్ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో గ్రంథాలయాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించి ముందుకు తీసుకొని పోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జయతీర్థచారి, మురారీ, భీమారాజ్, అచ్యుతక్క శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతోపాటు తల్లి అదృశ్యం

బషీరాబాద్, న్యూస్‌టుడే: ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైంది. ఎస్సై గఫార్ తెలిపిన వివరాలు.. మండలంలోని పర్శానాయక్ తండాకు చెందిన ఓ మహిళ కుమారుడు, కుమార్తెతో కలిసి గురువారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, కుటుంబ సభ్యుల వద్ద వెదికినా ఆచూకీ లభించ లేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.


దుమ్ము బాధలు తీరేదెప్పుడో?

తాండూరు గ్రామీణ: గౌతాపూర్ నుంచి పట్టణం వరకు జాతీయ రహదారి మార్గంలో రహదారిపై అడుగులోతు గుంతలు పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకల సమయంలో పెద్దఎత్తున దుమ్ము లేస్తోంది. రాత్రి సమయంలో రహదారిపై ఏమీ కన్పించని దుస్థితి ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులు ప్రతిరోజు అవస్థలు పడుతున్నారు. రోజూ పది వేల మందిపైగా ప్రయాణించే రహదారిపై దుమ్ముతో అనారోగ్యాలకు గురవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



విద్యుత్తు వృథాకు అడ్డుకట్టేది!

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: బిందెంగడ్డ తండాలో వీధి దీపాలు రాత్రి పగలు తేడా లేకుండా వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్తు అంతా వృథా అవుతుంది. చాలా రోజులుగా వీధి దీపాలు ఇలాగే వెలుగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. నిరంతరంగా వెలగడంతో దీపాలు పాడైపోయే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా గ్రామ పంచాయతీలకు విద్యుత్తు బిల్లులు కూడా ఎక్కువగా రావచ్చు. దృష్టి సారించి విద్యుత్తు వృథాకు అడ్డు కట్ట వేసేలా చూడాలని గిరిజనులు కోరుతున్నారు.



వైభవంగా శివపార్వతుల కల్యాణం

బషీరాబాద్, న్యూస్‌టుడే: మండల పరిధి బాద్లాపూర్ తండాలో శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. పలు జంటలు వధూవరుల తరఫున కూర్చొని కల్యాణం నిర్వహించారు. దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఆకట్టుకున్న అవతారాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గౌతాపూర్ శివారు చెరువెంటి ఈశ్వరాలయంలో బాలికలు అమ్మవారి తొమ్మిది అవతారాల్లో ఆకట్టుకున్నారు. తొమ్మిది మంది బాలికలను ఆలయ సంఘం అధ్యక్షుడు వాలి శాంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జొన్నల బస్వరాజ్, మహిళా సంఘం ప్రతినిధులు వాలి కావ్యశ్రీ, జొన్నల శివజ్యోతి, వాలిప్రభావతి, మాధవి, రజితారెడ్డి, మఠం పూజిత అభినందించారు.
– న్యూస్‌టుడే, తాండూరు గ్రామీణ

ఆలయ ఆధునికీకరణ పనులు ప్రారంభం



కొత్లాపూర్(తాండూరు గ్రామీణ), న్యూస్‌టుడే: కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ ఆధునికీకరణ పనులు ప్రారంభమయ్యాయి. ఆలయ గర్భగుడి వద్ద పైభాగంలో వరదనీరు కారకుండా స్లాబ్ పనులు నిర్వహిస్తున్నారు. ఆలయ పక్కనున్న 2 ఎకరాల వ్యవసాయ భూమిని రూ.56లక్షలకు ఆలయ వ్యవస్థాపకులు, కర్ణాటక రాష్ట్ర విద్యా శాఖ మాజీ మంత్రి అరవిందలింబావళి కొనుగోలు చేసినట్లు ఆలయ సంఘం అధ్యక్షులు నవీన్‌రెడ్డి శుక్రవారం వెల్లడించారు. నూతనంగా కొనుగోలు చేసిన స్థలంలో భక్తులు రాత్రి బస చేసేందుకు వీలుగా గదులు, స్నాన గదులు, శౌచాలయాలు, వంటశాలలను నిర్మించి భక్తులకు సదుపాయాలు కల్పిస్తామన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తాండూరు ప్రగతికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డిపై భారాస నేతలు ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్ చంద్ అన్నారు. గతంలో తాండూరు అభివృద్ధిని నేతలు విస్మరించారని ఆరోపించారు.

గతంలో నిధుల్లేని జీవోలు తెచ్చిన భారాస

తాండూరు, న్యూస్‌టుడే: గత భారాస ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అభివృద్ధి పనులకు నిధుల్లేని జీవోలు తీసుకొచ్చారని పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ శుక్రవారం విమర్శించారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. పదేళ్ల భారాస ప్రభుత్వ హయాంలో తాండూరు- వికారాబాద్ రోడ్డును బాగు చేయలేదని విమర్శించారు.

సందడిగా ఆత్మీయ సమ్మేళనం

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: పరిగి మండలం మిట్టకోడూరు జడ్పీహెచ్ పాఠశాలలో 2008-09లో 10తో తరగతి బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనంలో గురువులను సన్మానించారు. 15 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కూర్చుని ఆప్యాయంగా తీపిగురుతుల్ని నెమర వేసుకున్నారు. హెచ్ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, మాణిక్యం, మంజుల, శైలజ, వీరప్ప, ప్రభాకర్, నర్సింలు, భాగ్యలక్ష్మి, పూర్వ విద్యార్థులు జగదీశ్వర్, గోవర్ధన్, నర్సింలు, శ్రీనివాస్, మహేశ్వరి, యాదమ్మ, జ్యోతి, బాలమణి, స్రవంతి, ప్రవీణ, అనంత, రేష్మ, వెంకటేష్, అంజి పాల్గొన్నారు.



మిట్టకోడూరు జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు, గురువులు



దుద్యాల: తండాలో చండీయాగం



కొడంగల్: ఆఖండ జ్యోతులతో తోగుట వీర క్షత్రియులు



తాండూరులోని కట్ట మైసమ్మ ఆలయంలో..



వాల్మీకినగర్ అమ్మవారికి పల్లకీసేవ

అమ్మరూపం.. అపురూపం

గ్రామాల్లో ప్రజలు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం మహిషాసురమర్దిని అలంకరణలో దుర్గాదేవి భక్తులకు దర్శనం ఇచ్చారు. పల్లెల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించి నైవేద్యాన్ని సమర్పించారు. మండపాల దగ్గర రాత్రి సమయంలో ప్రత్యేక భజనలు, కోలాట నృత్య కార్యక్రమాలతో పిల్లలు, పెద్దలు, మహిళలు సందడి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, బృందం

ప్రవక్త మార్గంలో పయనిద్దాం

వికారాబాద్, న్యూస్‌టుడే: మహ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయమని, ఖురాన్ పఠిస్తూ ఆధ్యాత్మికతను అలవర్చుకొని అందరం ఆయన చూపిన మార్గంలోనే పయనిద్దామని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శుక్రవారం రాత్రి వికారాబాద్ పట్టణంలోని శివారెడ్డిపేటలో నిర్వహించిన మిలాద్-ఉన్-నబీ జల్సా ఉత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రవక్త జీవితం ఆదర్శమని, ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. అందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలన్నారు. ఇప్పటి వరకు 40వేల మంది అసువులు బాసినా వెరవని పాలస్తీనియన్ల పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఇజ్రాయెల్ ఆగడాలను ఆపాలన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసదుద్దీన్ ఒవైసీ

అన్ని గ్రామాలకు శాఖలను విస్తరిస్తాం

కుల్కచర్ల, న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని అన్ని గ్రామాలకు శాఖలను విస్తరించనున్నట్లు ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ ప్రచారక్ కిరణ్‌జీ అన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలకు ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన స్వయం సేవలకుతో శోభాయాత్రను నిర్వహించారు. అనంతరం స్వామి వివేకానంద కళాశాల ఆవరణలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రహ్లాదరావు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మాజీ సర్పంచి ఎల్లయ్య తదితరులతో కలసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.



ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న స్వయం సేవకులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పద సంచాలన్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్యక్రమం చేపట్టారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

బొంరాస్‌పేట: లోతుకుంటతండాలో అనారోగ్య సమస్యలతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాల ప్రకారం. . తండాకు చెందిన ఉనికీబాయి(60) కొన్ని నెలల నుంచి కాళ్లనొప్పులు, కడుపునొప్పితో బాధపడుతుంది. బాధలు భరించలేక గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె కూతురు పాపిబాయి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొడంగల్ ప్రయాణ ప్రాంగణంలో.. కోటి తిప్పలు

● ఏళ్లుగా ప్రయాణికులకు తప్పని అవస్థలు

న్యూస్‌టుడే, కొడంగల్: రెండు జాతీయ రహదారులకు కూడలిగా ఉన్న ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో సరైన సౌకర్యాలు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. 1981లో నాటి పరిస్థితులకు అనుగుణంగా దాదాపు 500 మంది ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని నిర్మాణం చేశారు. నేడు ప్రతి రోజు 15 వేల మందికి పైగా కొడంగల్ బస్టాండ్ నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. దాదాపు 100కు పైగా బస్సులు నిత్యం కొడంగల్‌కు వచ్చి పోతుంటాయి. బస్టాండ్ చిన్నగా ఉండడంతో ప్రయాణికులు నిత్యం చెట్లు కింద, షెడ్డు పక్క నిలబడి బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ప్రయాణికులకు తగిన విధంగా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమౌతున్నారనే ఆరోపణలున్నాయి.

ఆదాయంపై దృష్టి ఏదీ?

ఇక్కడ ప్రయాణికుల ద్వారా ప్రస్తుతం నెలకు దాదాపు రూ.1.50లక్షల వరకు ఆదాయం ఆర్టీసీకి వస్తుంది. దానితో పాటు నెలకు మరో రూ.5 లక్షలకు పైగా వచ్చే అవకాశం ఉంది. ఈ ఆదాయం పై అధికారులు దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ బస్టాండ్ రెండు జాతీయ రహదారులకు సమీపంలో ఉండటంతో దుకాణా సముదాయాల నిర్మాణం చేస్తే సుమారు 30 వరకు ఏర్పాటు చేసుకొనే అవకాశం ఉంది. గతంలో బస్టాండ్‌లో పెట్రోలు పంపు నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయినా కార్యరూపం దాల్చడం లేదు.

బస్టాండ్‌లో పరిస్థితి ఇలా..

● ప్రయాణికులు కూర్చొనేందుకు బల్లలు లేవు, రద్దీ సమయంలో స్థలం సరిపోవడం లేదు. ● ప్రయాణికులకు తగినట్లు మరుగుదొడ్లు, టాయిలెట్లు లేవు.

● ప్రస్తుతం తడకల షెడ్డుకింద ప్రయణికులు కుర్చోంటున్నారు.

● హోటల్ ఇతర ప్రదేశాల పక్కన ఉన్న ఖాళీ స్థలంలో జాలీలతో కంచెలు వేశారు.

● పారిశుద్ధ్య సమస్య మూలంగా నిత్యం దుర్గంధం వెదజల్లుతోంది.



బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

కొడంగల్ ప్రయాణ ప్రాంగణాన్ని కొత్తగా నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు దాదాపు సిద్ధం అయ్యాయి. పారిశుద్ధ్య సమస్యలపై సత్వరం దృషి సారించే విధంగా అక్కడి అధికారులు, సిబ్బందికి సూచనలు ఇస్తాం. పరిస్థితిని చక్కదిద్దుతాం. –సురేష్‌కుమార్, డిపో మేనేజరు, తాండూర్

సద్దుల బతుకమ్మ సందడి



చెరువెంటి ఈశ్వరాలయం వద్ద..



ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

తాండూరు గ్రామీణ: తొమ్మిదో రోజు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. గౌతాపూర్ శివారు చెరువెంటి ఈశ్వరాలయంలో మహిళలు, యువతులు పెద్దసంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆడిపాడారు. ఏర్పాట్లను ఆలయ సంఘాల అధ్యక్షుడు వాలిశాంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జొన్నల బస్వరాజ్ పర్యవేక్షించారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి కాగ్నాలో నిమజ్జనం చేశారు.

పరిగి: పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలను కాలనీ వాసులు శుక్రవారం సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు.